# స్వార్థం చావదు!

పాలకోడేటి సత్యనారాయణరావు

పార్వతి అ రోజు న్యూస్ బులెటిన్ మోసుకొస్తూ అంది-"మన పక్కింట్లో వాళ్ళకు ముగ్గురు ఆడపిల్లలండోయ్!"

నాకు తలనొప్పి వచ్చింది— "ఇదుగో పార్వతీ, మాట..."

"సరే, అర్థమయింది, చెప్పనులెండి...నా కెందుకొచ్చిన గొడవ— అయినా ఒకటడుగుతా చెప్పండి. మనం మన విషయాలే మాట్లాడుకొంటే ఏ మందం ఉంటుంది చెప్పండి?"

'అందుకని మన కాలక్షేపం కోసం, పక్కింటి వాళ్ళ విషయాలు మాట్లాడు కొందామా?'

'ఇందులో తప్పేమిటో అర్థం కావటంలేదు నాకు— మన పక్కింట్లో ఒకరుంటున్నారు. ఆ సంగతి మీకు నేను చెప్పకపోయినా తెలుస్తుంది! వాళ్ళకు ముగ్గురాడపిల్లలు—ఈ సంగతి మీరు ముందే కనిపెట్టి ఉంటారు! ముగ్గురూ వయసొచ్చిన వాళ్ళేనని మీ మగ బుద్ధి మీకు ముందే చెప్పిఉంటుంది- పెద్దమ్మాయి. ఆ అమ్మాయి పేరేమిటీ...ఆ, ఇందుమతి, అదేదో ఆఫీసులో ఉద్యోగం చేస్తోందన్న సంగతి రేపు మీకే తెలుస్తుంది. ఆ రెండో అమ్మాయి— భానుమతి—ఎంచక్కా పాటలు అవీ పాడుతుందన్న సంగతి..."

'పార్వతీ ప్లీజ్...' అన్నాను నేను నిస్సహాయంగా.

'సరే, అర్థమయింది లెండి ... నా కెందుకొచ్చిన గొడవ...' పార్వతి లోపలికి వెళ్ళిపోయింది.

—పార్వతి నా భార్య. గర్వంగా చెప్పుకోవచ్చును. ఆ రాక్షసి అందంగా ఉంటుంది. కలిగివున్న వాళ్ళ కుటుంబంలో పుట్టింది గనుక బాగానే చదువుకొంది. చదువు మీద శ్రద్ధ తగ్గి, పెళ్ళిమీద మోజు పెరిగే సమయానికి పార్వతి బి. ఏ. పాసయింది- ఇవన్నీ పార్వతిలో ప్లస్ పాయింట్లు అయితే, పక్కింటి వాళ్ళ విషయాలు వినటం, వాటిని చర్చించు కోవాలనే బుద్ధి కలిగి ఉండటం ఒక్కటే మైనస్ పాయింట్—కొన్ని లాభాలు కావాలని కోరుకుంటే, ఒకటి రెండు చోట్ల నష్టపోవటం మంచి వ్యాపార పద్ధతి అంటే పార్వతిని పెళ్ళాడటంలో నేనేదో వ్యాపార సరళి అనుసరించానంటే మాత్రం ఒప్పుకోను_కానీ, ఒకటి మాత్రం నిజం, పెళ్ళనేది ఒక పెద్ద వ్యాపారం. ముఖ్యంగా మన తెలుగుదేశంలో. ఈ వ్యాపారంలో దివాళా తీసిన కుటుంబాలు ఎన్నో నాకు తెలుసు.

—ఈ సంగతే నాకు మర్నాడు పార్వతి చెప్పింది.

'ఏమండోయ్, మనపక్కింట్లో ఉన్న ఇందుమతికి యింకా పెళ్ళే కాలేదండోయ్!'

'పార్వతీ...'

'సరే. అర్థమయింది, చెప్పనులెండి...ఇందుమతికి పెళ్ళయితేనేం, కాకపోతేనేం, నాకేం? ఏదో, పాపం పాతికేళ్ళు వచ్చినా ఇంకా ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదని తెలిసి. కొంచెం సానుభూతి చూపించబోయాను, అంతే కానీ ...'

'అది కాదు పార్వతీ, పక్కయింటి వాళ్ళ విషయాల్లో...' ఏదో చెప్పబోతున్న నన్ను ఆపి అంది పార్వతి—"పక్కింటివాళ్ళ విషయాలు కొంచెం గూడ పట్టించుకోకుండా ఉండడం అనేది నావల్ల కాని పనిసుమండి...అందరూ ఒంటి పిల్లి రాకాసిలా బతకలేరు..."

ఈ విసురు నా పైనే అనేది తెలుస్తోంది. ఇలా ఆలోచించే వ్యక్తితో యెంతగా వాదించినా గెలవ లేమని నాకు తెలుసు. అందుకే మౌనంగా ఉండి పోయాను. నా మౌనాన్ని అలుసు తీసుకొని అంది పార్వతి—"మనిషి అన్న తర్వాత పక్కవాళ్ళ గురించి ఆలోచించకుండా కొందరు యెలా బతుకు తారో నాకు అర్థం కాదు సుమండీ!"

నేనేమీ అనలేదు.

ఆ రోజు సాయంత్రానికి నా కెన్నో విషయాలు తెలిసాయి- మా పక్కయింట్లో ఉన్న ముగ్గురు ఆడ పిల్లల తండ్రి పక్షవాతం వచ్చి, చచ్చి బతుకుతున్న మనిషి. ఇందుమతి కుటుంబానికి కాలు చెయ్యీ కూడదీసే ప్రయత్నంలో ఉంది. తను చదవాల్సిన చదువు ఎంతో మిగిలిపోయి ఉన్నా కానీ, చదివింది చాలనుకొని తృప్తిపడి, ఉద్యోగాన్వేషణలో పడింది. కానీ, పార్వతి అనుకొన్నట్లుగా ఉద్యోగం చేయటం లేదు గానీ, అక్కడా ఇక్కడా ట్యూషన్లు చెప్పి బతుకుతోంది. ఆ ట్యూషన్లలో కుటుంబాన్ని అవ తలి గట్టుకు చేర్చే ప్రయత్నంలో ఉంది. రెండో అమ్మాయి — భానుమతి — శ్రద్ధగా చదువుకొంది. అక్కయ్యతో పాటుగా తనూ ఉద్యోగం చేస్తానని ఇంట్లో గొడవపడి, చివరకు తనే గెలిచిందట—

"అలా ఉండాలండీ అసలు కుటుంబం అంటే!— అందులోనూ ఆడపిల్లలు..."

"పార్వతీ .."

'సరే, అర్థమయింది...అసలు నేనుచె బుతున్నది లోకం పోకడ గురించి. రెక్కలు వచ్చిన కొడుకు లంతా ఎగిరిపోవడం ఎంత మాములుగా జరుగుతోందో ఆడపిల్లలు మాత్రం అంతే సహజంగా కుటుంబాలలో ముసలి పక్షుల్ని ఆదుకోవడం జరుగుతోంది...'

—అయిదారు నెలలు దాటాయి. ఈ అయిదారు నెలలలో పార్వతి ఎప్పుడూ ఏదో ఒకటి ఆ కుటుం బం గురించి చెబుతూనే ఉంది. ఆ కుటుంబంలో వ్యక్తులందర్నీ పార్వతి కాచివడపోసింది.

—ఆరోజు నేను లేచేసరికి ఇంటిలో కొంచెం హడావుడిగా ఉంది. ఇందుమతి పార్వతికి యేదో చెబుతోంది. పార్వతి ఏదో సమాధానపరుస్తున్నట్లుగా ఉంది. నన్ను చూసి తత్తరపడింది ఇందుమతి.

'పర్వాలేదు ఇందూ' కూర్చో!... చూశారా, ఏం జరిగిందో?—"

ఇందుమతి పార్వతిని వారించబోయింది. పార్వతి అదేమీ పట్టించుకోకుండా చెప్పుకు పోయింది—'వీళ్ళ చెల్లెలు, భానుమతి, చూశారా ఎంతపని చేసిందో?—"

'ఏం చేసింది?'

పార్వతి, ఇందుమతి చేతిలో ఉన్న కాగితాన్ని లాక్కుని, నాకు అందించింది. మడతలిప్పి చదువుకో సాగాను—

"అక్కా,

ఇలా చేస్తున్నందుకు నేనేమీ క్షమాపణ కోరటం లేదు.

యవ్వనంలో ఉన్నపుడు జంటను వెతుక్కుంటూ వెళ్ళడంతో తప్పుందని నేను అనుకోను. పైగా జంట, నన్నే వెతుక్కుంటూ వస్తే, ఈ క్షణంలో 'కుటుం బం' అని క్షణం ఆలోచిస్తే, ఆ తర్వాత జీవితాంతం ఏడవాల్సి వుంటుంది. పైగా అది ఆత్మవంచనే అవు తుంది—అందుకే వెళ్ళిపోతున్నాను.

వెళ్తున్న ముందో సలహా—అక్కా, మన యిల్లే ప్రపంచంగా బతకటంలో నీకెంత సంతోషం ఉందో నాకు తెలీదు. ఇంకనైనా ఈ ఆత్మవంచన మానేసి, రెక్కలు దులుపుకొని బయటకొచ్చి ఒకసారి చూడు. ఇంతకన్న రంగైన ప్రపంచం, ఆకర్షణీయంగా ఆహ్వానిస్తూ కనబడుతుంది — ముసలితనం ఇంకా చాలదూరంలో ఉంది. ఇప్పటికైనా కళ్ళు తెరచి, ఈ కూపంలోంచి బయటపడు—

ఈ ముసలి బ్రతుకులు రెండూ—అదే, అమ్మా, నాన్నా, పోయాక — నువ్వు ముసలిదానివి అవుతావే కాని, పోతున్న యీ యవ్వనం నీకు అవుడు ఏదీ సమకూర్చలేదు. అందుకే త్వరపడు, ఇంకా ఆలస్యం కాలేదు—

నీ చెల్లెలు
భానుమతి."

చదవటం పూర్తిచేశాక, కాగితం మడతవేసి పార్వతికి అందించాను.

"చూశారా, ఎలా రాసిందో," అంది ఇందుమతి.

నేను పెదవి విప్పలేదు—ఎందుకంటే, భానుమతి అంటున్నది రైటేనని నా ఊహ. ముసలితనం వచ్చాక చేసేది ఏముంది గనుక? కుటుంబాన్ని పెళ్ళి చేసుకొని మాత్రం పోషించ కూడదా ఏం?— ఇవన్నీ పైకి అనేవి కావు. అందుకే ఊరుకుండి పోయాను.

పార్వతి మాత్రం నన్ను చంపేసింది ఆరోజు రాత్రి-'ఛీ.ఛీ, అదేం బ్రతుకండీ? ఇలా లేచిపోయి...'

"అది లేచిపోవటం కాదు పార్వతి..."

"ఇంకేం పేరు పెడతారు దానికి? ఏ పేరుపెట్టినా జరిగింది అదే!- కుటుంబం అంటే బాధ్యత లేకుండా ఇలా స్వార్థంతో బతకటం...చాల కష్టం గదూ!-"

"పార్వతీ-ఒకసారి ఇలా చూడు- ఇలాంటి అవకాశం, భానుమతి అన్నట్లు, ఎప్పుడోగానీ రాదు. అవకాశం వస్తే జారవిడుచుకోవటం తెలివితక్కువనే అవుతుంది. మీ ఇందుమతికి ఇలాటి అవకాశం వచ్చి ఉండదు. వచ్చి ఉంటే..."

"మా ఇందుమతి అలాటి మనిషికాదండీ, అలాటి వెధవ పనులన్నీ మీ భానుమతికే! ఇందుమతి గురించి మీకేం తెలుసు?- భానుమతి అంటే వదిలి వెళ్ళిపోగలిగింది కానీ... ఛీ-ఇందుమతి అలాటి పని చేయనే చేయదు-"

"పార్వతి, ఇందుమతి అలాటి పని చేయనే చేయలేదంటే కారణం, అవకాశం దొరకలేదేమో!-"

"ఛీ, మీ వన్నీ వంకర ఆలోచనలు—" అంది పార్వతి.

—ఒక సంవత్సరం గడిచిందో లేదో నాకు గుర్తు రాలేదు. ఆ రోజు ఉదయం పార్వతి నిద్రలేపుతూ ఉంది—"మీరన్నది నిజమేనండీ-"

కళ్ళు నులుముకొంటూ అడిగాను- 'ఏమిటి?'

,ఆదేనండీ—ఇందు గురించి మీరు చెప్పింది అక్షరాలా రైటే అయింది- ఇందుమతికి మీరన్న అవకాశం అపుడే వచ్చింది- ఎంతైనా స్వార్థం చావదు సుమండీ!...'

పార్వతి ఇంకా ఏదో అంటోంది—నేను వినటం లేదు. గర్వంగా పక్కమీద నుంచి లేచాను, ఇందుమతిని, కాదు, భానుమతిని మనస్ఫూర్తిగా అభినందిస్తూ.

★

*With best Compliments from :*

Phones : Offi : 7 6 5 1 9
Res : 7 5 0 2 3

# HERMES TOOLS CENTRE

***Dealers in*** :
HARDWARE, MACHINE, PRCISION TOOLS & GENERAL MERCHANTS.
***Specialists*** :
Auto workshop garage tools and service station equipments and accessories
5-2-179, Rashtrapathi Road, SECUNDERABAD-3. A. P.